క్లుప్తంగా

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోండి



ఫిజియోథెరఫీ సేవలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సాయిచక్రధర్

గజపతినగరం: స్థానిక భవిత కేంద్రంలో అందిస్తున్న ఫిజియోథెరఫీ సేవలను ప్రత్యేక అవసరాల పిల్లలు వినియోగించుకునేలా తల్లిదండ్రులు చూడాలని ఎంఈఓ-2 సాయిచక్రధర్ సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపిస్ట్ హిమబిందు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు అందిస్తున్న ఉపకరణాలు, విద్యాబోధనపై ఐఈఆర్‌టీలు శ్రీనివాసరావు, సత్యనారాయణను ఆరా తీశారు. సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న యువతులు

వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామంలో సాంబమూర్తి తీర్థ మహోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో 52 మంది మహిళలు పాల్గొనగా విజేతకు కూలర్ ఫ్యాన్, ద్వితీయ స్థానంలో నిలిచిన ఇద్దరికి స్టాండ్ ఫ్యాన్‌లు, తృతీయస్థానంలో నిలిచిన ముగ్గురికి ఇస్త్రీ పెట్టెలు, నాలుగో స్థానంలో నిలిచిన నలుగురికి హాట్ బాక్సులు, మిగిలిన వారికి కన్సోలేషన్ బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఉదయం స్వామి వారికి అర్చకులు పవన్ శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.


ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ధర్మవరం హైస్కూల్‌లో ప్రచారం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

శృంగవరపుకోట: ఆరేళ్లపాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఊపిరిగా పనిచేసిన ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మను తిరిగి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల కోరారు. ఏపీటీఎఫ్ సంఘ నాయకులు, సభ్యులు ఎస్.కోట, జామి మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ప్రచారం చేశారు. ఏపీటీఎఫ్ బలపరిచిన రఘువర్మను గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుఖారిబాబు, సీనియర్ నాయకులు బంకురు జోగినాయుడు, చీమలపాటి శర్మ, చిన్నం నాయుడు, చిరంజీవి, శివాజీ, వెంకునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు



ఈ- క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ శ్రావణి తేజ

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురంలో వీఏఏ కూర్మారావు శుక్రవారం చేపట్టిన మొక్కజొన్నపంట ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఏఓ శ్రావణి తేజ పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1,790 ఎకరాల్లో మొక్కజొన్న పంట ఈ-క్రాప్ నమోదు పూర్తయ్యిందని చెప్పారు. ఈ- క్రాప్ చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

సందర్శన..



జాకేరులో విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

వేపాడ: విద్యార్థులచే చతుర్విధ ప్రకియలు చేయించడంతో పాటు ఇంగ్లిష్ చదవించడం, రాయించడం చేయాలని ఎంఈఓ-2 బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. జాకేరు ఎంపీయూపీ, కరకవలస ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తరగతి గదులు, వంటగది, టాయిలెట్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.

నిబంధనలకు పాతర..!

- సొంత స్థలం, పశువులు లేని వారికి మినీగోకులాలు మంజూరు చేసినట్లు ఆరోపణలు
- అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్న కూటమినేతలు
- పెణసాంలో ప్రభుత్వ స్థలంలో గోకులాలు నిర్మిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదు



పెణసాంలో నిర్మించిన మిని గోకులం షెడ్డు

గంట్యాడ: అధికార పార్టీ నాయకులు తమ అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ నిబంధనలకు పాతర వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి నేతల ఆదేశాలకు అధికారులు జీహుజూర్ అంటూ వారి చెప్పినట్లు తలాడిస్తూ నిబంధనలతో పనేముంది, మీరేం ఏది చెబితే అదే రూల్ అన్నట్లు పనిచేస్తున్నారనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు పక్కన పెట్టి మండలంలోని పెణసాం గ్రామంలో మినీగోకులాల షెడ్ల మంజూరులో అధికారుల వ్యవహరించిన తీరు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. అధికార పార్టీ నేతలు చెప్పారని సొంత భూమి లేని వారికి సైతం మినీ గోకులాలు మంజూరు చేయడం, ప్రభుత్వ భూమిలో నిర్మించుకుంటున్న వారికి బిల్లులు చెల్లించేందుకు అధికారులు సిద్ధమైనట్లు సమాచారం. పెణసాంలో పలువురు గోకులాలను ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్నారని, కొందరికి పశువులు లేకపోయినా మంజూరు చేశారని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎంపీడీఓ, ఉపాధి హామీ ఏపీఓలకు ఇటీవల ఫిర్యాదు చేశారు.

11 మినీ గోకులాలు మంజూరు

పెణసాం గ్రామానికి 11 మినీగోకులాలు మంజూరయ్యాయి. ఇందులో ఒకరు నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రాలేదు. మిగతా పది గోకులాల్లో ఒకటి గొర్రెలకు సంబంధించిన షెడ్డు కాగా, తొమ్మిది పశువులకు సంబంధించినవి. వీటిలో ఆరు షెడ్ల నిర్మాణ పనులు పూర్తికా గా,మరో మూడు పునాది దశలో ఉన్నాయి. అయితే పదింటిలో నాలుగు మినీ గోకులాలకు మాత్రమే వీఆర్‌ఓ ల్యాండ్ పొజిషన్ పట్టా ఇచ్చారు. మిగతా ఆరు నిర్మాణాలకు ఇంకా ల్యాండ్ పొజిషన్ పట్టా ఇవ్వలేదని సమాచారం.

ఫిర్యాదు అందింది

పెణసాం గ్రామంలో ప్రభుత్వ స్థలంలో గోకులాలు నిర్మిస్తున్నారని ఫిర్యాదు అందింది. ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ వచ్చి న వాటికి మాత్రమే బిల్లులు పెట్టాం. మిగతా వాటిని పెండింగ్‌లో ఉంచాం.
– సుందరరావు, ఉపాధిహామీ ఏపీఓ, గంట్యాడ మండలం

అర్హతలు, రాయితీ వివరాలు:

- దారిద్య్రరేఖకు దిగువన ఉన్న వారు అర్హులు
- పశువులు, గొర్రెలు, మేకలు, సొంత స్థలం ఉండాలి
- ఆధార్ కార్డు, జాబ్ కార్డు, తెల్లరేషన్ కార్డు, భూపట్టా వివరాలు, బ్యాంక్ అకౌంట్ ఉండాలి
- రెండు పశువుల యూనిట్ షెడ్డు నిర్మాణానికి 24 గజాల స్థలం ఉండాలి. యూనిట్ విలువ లక్ష రూపాయలు, రైతు వాటా రూ.10 వేలు చెల్లించాలి. ప్రభుత్వం రూ. 90 వేలు ఇస్తుంది.
- నాలుగు పశువుల యూనిట్ షెడ్డుకు 48 గజాల స్థలం ఉండాలి. యూనిట్ విలువ రూ.1.50లక్షలు. ఇందులో రైతు వాటా రూ.15 వేలు కాగా ప్రభుత్వం రూ.1.35 లక్షలు ఇస్తుంది.
- ఆరు పశువుల యూనిట్ షెడ్డుకు 72 గజాల స్థలం ఉండాలి.యూనిట్ విలువ రూ.1.80 లక్షలు.రైతులు రూ.18 వేలు చెల్లించాలి.ప్రభుత్వం రూ.1.62 లక్షలు ఇస్తుంది.

నాలుగింటికే సర్టిఫికెట్ ఇచ్చాం

గోకులాలకు సంబంధించి నలుగురు లబ్ధిదారులు వన్‌బీలు ఇచ్చారు. వారికి మాత్రమే ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చాం. మిగతా ఆరుగురు లబ్ధిదారులు ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుకు వన్‌బీలు జతచేయాలని చెప్పాం. వన్‌బీలు అందజేస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించాక ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తాం.
– నరసింగరావు, వీఆర్‌ఓ, పెణసాం

• కమ్మేసిన పొగ మంచు



గజపతినగరంలో లైట్ల వెలుగులో వాహనాల రాకపోకలు



ఎస్.కోటలోని విశాఖ- అరుకు రహదారిలో కురుస్తున్న మంచు



బొండపల్లి జాతీయ రహదారి-26లో కమ్ముకున్న పొగమంచు

విజయనగరం జిల్లా వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం 8 గంటల వరకు దట్టంగా కురిసిన పొగమంచుతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పట్టపగలు రహదారులు కనిపించనంతగా మంచు కురిసింది. ఉదయం 8 గంటల సమయంలో కూడా వాహన చోదకులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించాల్సి వచ్చింది.
– సాక్షి నెట్‌వర్క్

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

చీపురుపల్లి: నియోజకవర్గ కేంద్రమైన చీపురుపల్లిలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎన్.రాజారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ, మూడు రోడ్ల జంక్షన్‌లో మానవహారం ఏర్పాటు, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



వేపాడ: మారికరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ భరత్,ఎమ్మెల్యే లలితకుమారి

వేపాడ: కరకవలస పంచాయతీ శివారు గిరిశిఖర మారిక గ్రామ రోడ్డు నిర్మాణానికి విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా పలువురు గిరిజనులు మారిక రెవెన్యూలో భూసమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు.కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్పందించి రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని తహసీల్దార్ రాములమ్మను ఆదేశించారు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు,వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ఎస్.కోట పంచాయతీలోని గిరిశిఖర గ్రామం రేగపుణ్యగిరికి రోడ్డు నిర్మించేందుకు ఎంపీ ఎం.శ్రీభరత్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు: గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ, సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన మండల అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమగ్ర భూరీసర్వే వివరాలను తహసీల్దార్ విజయభాస్కర్ వివరిస్తుండగా మంత్రి స్పందిస్తూ..రెవెన్యూ సదస్సుల గ్రామస్థాయి నివేదికలు, 22-ఏ భూముల జాబితా, ఈనాం భూముల వివరాలతో నివేదిక అందజేయాలని ఆదేశించారు. మండలానికి తాగునీరు సరఫరా చేసే బాడంగి మండలంలోని ముగడ గ్రామంలో ఉన్న సీపీడబ్ల్యూ పథకం వద్ద రోజూ 100 ట్రాక్టర్ల ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, వేసవిలో 60 గ్రామాలకు తాగునీరు అందించడం కష్టమవుతుందని మంత్రికి జేఈ కార్తీక్ వివరించారు.ఎనిమిది నెలలుగా గ్రామాల్లో గ్రీన్ అంబాసీడర్లకు జీతాలు అందకపోవడంతో కొంత మంది విధులకు రావడం లేదని ఈఓపీఆర్డీ వాణిశ్రీ, పల్లె పండగలో భాగంగా సీసీ రోడ్లు,కాలువలు నిర్మించిన వారికి బిల్లులు అందలేదని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రైల్వే మూడో లైన్ కోసం పెదమానాపురం వద్ద భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి తక్కువ మొత్తంలో పరిహారం జమచేశారని, నిర్వాసితులకు పరిహారం పెంచి ఆదుకోవాలని జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి మంత్రిని కోరారు. గ్రామాల్లో శిథిలమైన విద్యుత్ స్తంభాలను గుర్తించి వెంటనే మార్చాలని ఏఈ ఆదిత్యను మంత్రి ఆదేశించారు. సమావేశం జరుగుతుండగా పలువురు టీడీపీ నాయకులు సమావేశ మందిరంలోకి వచ్చి అడ్డు తగలడంతో వారిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు బంగారు భవితనిద్దాం

బాలికలపై వివక్షను తొలగించి..వారిని మగపిల్లలతో సమానంగా ఎదిగే అవకాశం కల్పించి వారికి బంగారు భవిష్యత్ ఇద్దామని, బాలికల సాధికారితకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓలు, వైద్యాధికారులు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది కోరారు. గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ).పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా బాలికల హక్కులు, ఆరోగ్యం, పౌష్టికాహారం, బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పలు కేజీబీవీల్లో విద్యార్థినులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అధికారులు మాట్లాడుతూ ఆడపిల్లలు చదువు, క్రీడలు, అన్ని రంగాల్లో రాణించాలన్నారు.
– సాక్షి నెట్‌వర్క్



లక్కవరపుకోట: ఎల్.కోటలో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న కేజీబీవీ విద్యార్థినులు



కొత్తవలస: వియ్యంపేటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది



బొండపల్లి: దేవుపల్లి కేజీబీవీలో విద్యార్థినుల మానవహారం



వేపాడ: వేపాడలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు, ఐసీడీఎస్ సిబ్బంది, అధికారులు



గంట్యాడ: కేజీబీవీలో మాట్లాడుతున్న ఎస్ఓ అల్లుజ్యోతి



దత్తిరాజేరు: కేజీబీవీలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయినులు, ఐసీడీఎస్ పీఓ నాగమణి, అధికారులు



గుర్ల: కేజీబీవీలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



శృంగవరపుకోట: వెంకటరమణపేటలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



మెరకముడిదాం: కేజీబీవీలో వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

• లంచ్ బాక్సుల వితరణ



యలకలపేట గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బి.కిశోర్‌కుమార్ తన తండ్రి ఆదిరాములు జ్ఞాపకార్థం లంచ్ బాక్సులు సమకూర్చారు. వీటిని సర్పంచ్ రఘుమండ త్రినాథ్ విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.శంకరరావు, నవభారత్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉజూరు హరి, తదితరులు పాల్గొన్నారు.
– చీపురుపల్లి

• ఆర్టీసీలో డ్రైవర్స్‌డే



రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఎస్.కోట ఆర్టీసీ డిపోలో శుక్రవారం డ్రైవర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎం కె.రమేష్‌తో పాటు ఇతర ఉద్యోగులు డ్రైవర్లకు పుష్పగుచ్ఛాలు, స్వీట్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డ్రైవర్లు పాటించాల్సిన నియమాలు, ఆర్టీసీలో అమలు చేస్తున్న భద్రతా నియమాలపై ప్రచారం చేస్తూ ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు డీఎం నేతృత్వంలో పట్టణ ప్రధాన రహదారిలో ర్యాలీ చేశారు.
– శృంగవరపుకోట

• స్టడీమెటీరియల్ పంపిణీ



మెరకముడిదాం కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లోని 36 మంది పదోతరగతి విద్యార్థినులకు హైదరాబాద్‌కు చెందిన బాలమిత్ర ఫౌండేషన్ ప్రతినిధులు స్టడీమెటీరియల్ సమకూర్చారు. ఎంఈఓ-2 ధర్మశ్రీను విద్యార్థినులకు శుక్రవారం వాటిని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధికి బాలమిత్ర ఫౌండేషన్ తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్న బాలమిత్ర ఫౌండేషన్‌కి ఎంఈఓ కృతజ్ఞతలు తెలిపారు. కేజీబీవీ ఎస్ఓ గౌస్యాబేగం, సీఆర్ఎంటీ శంకరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.
– మెరకముడిదాం

లక్కీడ్రా విజేత సత్యం..



డ్రా తీస్తున్న డీఎస్ఓ కె.మధుసూదనరావు

గజపతినగరం: స్థానిక శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ వినియోగదారులకు సంబంధించి విజయనగరం డీఎస్ఓ కార్యాలయంలో డీఎస్ఓ కె. మధుసూదనరావు శుక్రవారం లక్కీడ్రా తీశారు. ఈ డ్రాలో దత్తిరాజేరు మండలం పాపయ్యవలస గ్రామానికి చెందిన బి.సత్యం విజేతగా నిలవడంతో.. ఆయనకు ఏజెన్సీ ప్రతినిధులు ఎలక్ట్రికల్ స్కూటీని అందజేశారు. కార్యక్రమంలో గజపతినగరం, విజయగరం హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు లంక రవి, శ్రీనివాస్, అజయ్, కోటి, తదితరులు పాల్గొన్నారు.

కషాయాలతో తెగుళ్ల నివారణ

గజపతినగరం: పంటలను ఆశించే తెగుళ్ల నివారణకు రైతులు రసాయన పురుగుమందులకు బదులు కషాయాలను వినియోగించాలని ఏపీసీఎన్ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జి బొడ్డు సూర్యారావు సూచించారు. మండలంలోని రాజుపేట గ్రామంలో రైతులకు అగ్నాస్త్రం, నీమాస్త్రం తదితర కషాయాల తయారీ పై శుక్రవారం అవగాహన కల్పించారు. పచ్చిమిర్చి, పొగాకు, వెల్లుల్లి, గోమూత్రం, వేపాకులతో అగ్నాస్త్రం తయారు చేయించారు. మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగు నివారణకు ఎకరా విస్తీర్ణానికి ఆరులీటర్ల అగ్నాస్త్రం కషాయాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. కాలం రాజుపేట సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, వీఏఏ మస్తాన్, ఐసీఆర్‌పీలు కె.సాయిసుధ, జి.సత్తిరాజు, బి.ఈశ్వరరావు,వై.సూర్యకళ, ఎం.త్రినాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు సరఫరా కాని కోడిగుడ్లు

దత్తిరాజేరు: మండలంలో పలు ప్రాథమిక పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరా కాకపోవడంతో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందడం లేదు. గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీకి ఉపాధ్యాయులు ఫోన్లు చేస్తున్నా స్పందించకపోవడంతో వంట నిర్వాహకులు చేసేది లేక విద్యార్థులకు కూరగాయలు, పప్పు, సారు అన్నంతో సరిపెడుతున్నారు. సంక్రాంతి సెలవులకు ముందు నుంచే గుడ్లు సరఫరా కావడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి నిలదీస్తే ఏం సమాదానం చెప్పాలో తెలియడం లేదని, వంట నిర్వాహకులు, హెచ్ఎంలు వాపోతున్నారు. సమస్యను ఎంఈఓ-2 సుధాకర్ వద్ద సాక్షి ప్రస్తావించగా...సమస్య తన దృష్టికి వచ్చిందని, కాంట్రాక్టర్‌ను హెచ్చరించామని, తక్షణం గుడ్లు సరఫరా చేయాలని చెప్పామన్నారు.

స్నేహపూర్వక వాతావరణంలో బోధన



మాట్లాడుతున్న ఎంఈఓ నాగభూషణం

వేపాడ: పాఠశాలలో స్నేహపూర్వక వాతావరణం కల్పించి బోధన చేపట్టాలని ఎంఈఓ-1 ఎస్.నాగభూషణం అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఆర్సీ భవనంలో నిర్వహించిన హెచ్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల నిర్వహణకు సంబంధించి రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాలలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయాలని సూచించారు. ఈ కూరగాయలనే మధ్యాహ్న భోజనంలో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 బాలభాస్కరరావు, హెచ్ఎంలు, సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

• గ్రామాల్లో పశువైద్య సేవలు



లక్కవరపుకోట: దూడలకు నట్టల నివారణ మందులు వేస్తున్న జిల్లా అధికారులు



చీపురుపల్లి: పత్తికాయవలసలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏడీ శారద, తదితరులు



గంట్యాడ: బోనంగిలో పాడి రైతుకు మందులు అందజేస్తున్న జేడీ వై.వి.రమణ

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగించుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులు సూచించారు. బొండపల్లి మండలంలోని గొట్లాం, ఎల్.కోట మండలంలోని లింగంపేట, చీపురుపల్లి మండలంలోని పత్తికాయవలస, గంట్యాడ మండలంలోని బోనంగి, మెరకముడిదాం మండలంలోని రామాయవలస, బుధరాయవలస గ్రామాల్లో శుక్రవారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు గర్భకోశవ్యాధి పరీక్షలు చేసి నట్టల నివారణ మందులు వేశారు. గొర్రెలకు షీప్ పాక్స్, మేకలకు గోట్ పాక్స్ వ్యాక్సిన్ వేశారు. జిల్లా బహుళార్థ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మహాలక్ష్మి, జిల్లా పశువ్యాధి నిర్ధారణశాల సహాయ డైరెక్టర్ రామ్‌ప్రసాద్, పశుసంవర్ధకశాఖ జేడీ వై.వి.రమణ ఏడీ ఆర్.శారద శిబిరాలను సందర్శించారు.
– సాక్షి నెట్‌వర్క్